# రోడ్ల నిర్మాణానికి రూ.300 కోట్లు

- ప్రతి లబ్ధిదారుడికి 6 గ్యారెంటీ పథకాలు అందిస్తాం
- రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

వికారాబాద్, జనవరి 2 : వచ్చే ఐదు సంవత్సరాల్లో 3000 కోట్ల రూపాయల నిధులతో వికారాబాద్ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధిపరుస్తానని రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక అంబేద్కర్ భవనంలో ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పది సంవత్సరాలుగా జిల్లా అన్ని రంగాల్లో వెనుకబడిపోయిందని, రాబోవు రోజుల్లో నియోజకవర్గ ప్రజలందరికీ అన్నలా ఉండి జిల్లాను అభివృద్ధిపరుస్తానని తెలిపారు. ప్రాణహిత చేవెళ్ల, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలకు గత పాలకులు అన్యాయం చేశారని, ఈ ప్రాజెక్టును పూర్తి చేసి జిల్లా ప్రజలకు సాగు, తాగునీరు అందించే దిశగా ముందుకు వెళ్తామన్నారు. జిల్లాలోని పంచాయతీరాజ్, రోడ్లు, భవనాల రహదారులన్నీ అస్తవ్యస్తంగా ఉన్నాయని, రోడ్ల నిర్మాణం కోసం రూ.300 కోట్ల నిధులను మంజూరు చేయించి అభివృద్ధిపరుస్తామని తెలిపారు. గత పది సంవత్సరాలుగా ప్రజలకు రేషన్ కార్డులు అందలేదని, దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ ముందుగా రేషన్ కార్డులు అందజేస్తామని తెలియజేశారు. రేషన్ కార్డుల తర్వాత ఎన్నికలకు ముందు చెప్పినట్లు 6 గ్యారెంటీలను అమలుపరుస్తామన్నారు. గత ప్రభుత్వం అప్పులు చేసి రాష్ట్ర ప్రజలపై భారం మోపిందని, వీటన్నింటినీ అధిగమించి ప్రతి ఇంటికి ఆరు గ్యారెంటీలను అందజేస్తామని తెలిపారు. రెండు లక్షల రూపాయల రుణమాఫీతో పాటు పథకాలను కూడా అమలుపరుస్తామని పేర్కొన్నారు. ఆరు గ్యారెంటీల అమలులో అధికారులు అవినీతికి పాల్పడితే తీవ్ర చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

### లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల అందజేత

ఈ సందర్భంగా రూ.1,01,116ల విలువ గల చెక్కులను స్పీకర్ 150 మంది కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు అందజేశారు. ఎన్నికలకు ముందు మంజూరైన నిధుల చెక్కులు ల్యాప్స్ కాకుండా, లబ్ధిదారులకు లాభం చేకూరాలనే ఉద్దేశంతో చెక్కులను అందిస్తున్నట్లు తెలిపారు. రాబోవు రోజుల్లో ఈ డబ్బులతో పాటు ఇచ్చిన హామీ మేరకు తులం బంగారం అందించనున్నట్లు స్పీకర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, వైస్ చైర్‌పర్సన్ శంషాద్‌బేగం, ఎంపీపీ చంద్రకళ, మున్సిపల్ కౌన్సిలర్లు, వార్డు మెంబర్లు, వికారాబాద్ నియోజకవర్గ ఎంపీపీలు చంద్రకళ, విజయలక్ష్మి, కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్, కౌన్సిలర్ సుధాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యుడు జాఫర్, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ రాజేందర్‌రెడ్డి, సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులున్నారు.

## అందరూ కలిసికట్టుగా ఉండాలి


కేటీఆర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న రోహిత్‌రెడ్డి

తాండూరు, జనవరి 2 : తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో తాండూరులో నిర్వహించే కార్యక్రమాలు, పార్టీ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యల గురించి మాట్లాడినట్టు చెప్పారు. తాండూరు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను తెలుసుకొని ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని రోహిత్‌రెడ్డి తెలిపారు. 2024లో ప్రజలందరూ బాగుండాలని, వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఘన విజయానికి అందరూ కలిసికట్టుగా ఉండాలని కేటీఆర్ కోరారు. త్వరలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

మంచాల : నగరంలో ఉన్న తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను బీఆర్‌ఎస్ మంచాల మండల నాయకుడు చింతకింది వీరేశం ముదిరాజ్ మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి గోపాల్

### సకాలంలో పోషకాలు అందిస్తే..
# అధిక దిగుబడులు

- జిల్లా వ్యవసాయాధికారి గోపాల్
- జియో లైఫ్ ఆధ్వర్యంలో రైతులకు

భూసారం, అధిక దిగుబడి వంటి అంశాలపై అవగాహన

కొడంగల్, జనవరి 2 : ఆశించిన మేరకు దిగుబడిని పొందాలంటే మొక్కలకు సకాలంలో సరైన పోషకాలను అందించాలని జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జియో లైఫ్ ఆధ్వర్యంలో రైతులకు భూసారం, అధిక దిగుబడి వంటి అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 3 లక్షల మంది రైతులున్నారన్నారు. కొడంగల్ నియోజకవర్గ పరిధిలో 58వేల మంది రైతులుండగా.. లక్షా30వేల ఎకరాల సాగు, జిల్లాలో 6లక్షల35వేల ఎకరాల సాగు కొనసాగుతున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో వ్యవసాయం పూర్తిగా వర్షాలపైనే ఆధారపడి ఉందని, ఇరిగేషన్‌పై కేవలం 20 శాతం మాత్రమే సాగు ఉంటుందని తెలిపారు. గత 4 సంవత్సరాల క్రితం జిల్లా పరిధిలో వరి సాగు కేవలం 35వేల ఎకరాల్లో కొనసాగేదని.. నీటి శాతం పెరగడంతో ప్రస్తుతం లక్షా30వేల ఎకరాల సాగు కొనసాగుతున్నట్లు తెలిపారు.

### అధికారుల సలహాలు, సూచనలు పాటించాలి

వర్షాకాలంలో వరి, ఇతర కాలాల్లో పత్తి, వరి, కంది, పెసర, మొక్కజొన్న వంటి వాటిని రైతులు పండిస్తున్నారని.. ఈసారి వర్షాలు సకాలంలో పడకపోవడంతో దిగుబడి తగ్గిందని డీఏవో పేర్కొన్నారు. ప్రస్తుతం రైతులకు వ్యవసాయాధికారులు క్లస్టర్ల పరిధిలోని రైతు వేదికల్లో అందుబాటులో ఉంటున్నారని, రైతులు పంట సాగులో అధికారుల సలహాలు, సూచనలు తప్పకుండా అందుకోవాలన్నారు. ఏ పంట ఏ కాలంలో వేయాలి, ఎంత మోతాదులో ఎరువులు వాడాలి వంటి తదితర అంశాలను రైతులు తప్పకుండా తెలుసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

### జియో లైఫ్ అవగాహన కల్పించడం సంతోషదాయకం

జియో లైఫ్ కంపెనీ వారు రైతులకు భూమిలో పోషకాల పెంపకం, ఎక్కువ దిగుబడిని సాధించే అంశాలపై ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసి అవగాహన కల్పించడం చాలా సంతోషంగా ఉందని, ఇందుకుగాను వారిని ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు డీఏవో తెలిపారు. జియో లైఫ్ వారు కొంత మంది రైతులకు ఎంచుకొని వారికి సరైన సూచనలు, సలహాలను అందించడంతోపాటు జియో లైఫ్ పోషక మందుల ద్వారా సాగు చేయించి అధిక దిగుబడిని సాధించేందుకు ప్రోత్సాహాన్ని అందిస్తున్నదన్నారు. దీంతో రైతులు ఎక్కువ దిగుబడిని సాధించి తోటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నట్లు తెలిపారు. అనంతరం జియో లైఫ్ ప్రొడక్ట్‌లతో అధిక దిగుబడులను సాధించిన రైతులను కంపెనీ యజమానులు సన్మానించారు. కార్యక్రమంలో జియో లైఫ్ చైర్మన్ వినోద్ లాహోటీ, ఓం ట్రేడింగ్ కంపెనీ యజమాని ఆనంద్ లాహోటీ, ఏడీఏ శంకర్ నాయక్ పాల్గొన్నారు.

### అర్హత కలిగిన పథకాలకే
# దరఖాస్తు చేసుకోవాలి

- రేషన్ కార్డు లేకున్నా దరఖాస్తుల స్వీకరణ
- రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ కార్యదర్శి శ్రీదేవి, వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి


లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న వాణిజ్య పన్నుల కార్యదర్శి శ్రీదేవి, కలెక్టర్

కొడంగల్, జనవరి 2 : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 6 గ్యారెంటీలకు సంబంధించి నిర్వహిస్తున్న ప్రజాపాలనలో అర్హత కలిగిన పథకాలకే దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ కార్యదర్శి శ్రీదేవి, వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి లబ్ధిదారులకు సూచించారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని 6వ వార్డులో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొని అబ్ధిదారులకు సూచనలు, సలహాలను అందించారు. ముందుగా పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని సందర్శించి కొనసాగుతున్న రెనోవేషన్ పనులను వారు పరిశీలించారు. అనంతరం ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులు అందిస్తున్న పథకాలకు సంబంధించిన దరఖాస్తులను వారు పరిశీలించి, లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

### పేదవారికి చేయూత

ఈ సందర్భంగా వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఆర్థికంగా వెనుకబడి ఉన్నవారికి చేయూతనందించేందుకు ప్రభుత్వం 6 గ్యారెంటీల అమలు కార్యక్రమాన్ని చేపడుతున్నదని, ఇందుకుగాను అర్హత కలిగిన పథకాలకు దరఖాస్తు చేసుకుంటే చాలా వరకు దరఖాస్తుల పరిశీలన సులువుగా ఉంటుందని పేర్కొన్నారు. రేషన్ కార్డు కోసం ప్రత్యేకంగా దరఖాస్తు అందించి, అధికారులు అందించే రసీదును పొందాలని సూచించారు. ఇందిరమ్మ అభయహస్త దరఖాస్తులో ఉన్న ప్రతి అంశాన్ని గుర్తించి పూరించాలని తెలిపారు. అవగాహన లేకపోవడం వల్ల లబ్ధిదారులు ప్రతి పథకానికి దరఖాస్తు చేసుకుంటున్నట్లు పేర్కొన్నారు. తమ పేరుపై కరెంటు బిల్లు చెల్లిస్తున్నారంటే ఇల్లు ఉంటేనే కదాని.. అటువంటప్పుడు మళ్లీ ఇంటికి దరఖాస్తు చేసుకోవడం వల్ల ప్రయోజనం ఏంటని లబ్ధిదారులను ప్రశ్నించారు. లబ్ధిదారులు ఆసరా పెన్షన్ పొందుతున్నా కూడా మళ్లీ దరఖాస్తులు అందిస్తున్నట్లు తెలిపారు. అత్యవసరం ఉన్న పథకాలను సరైన వివరాలతో కూడిన దరఖాస్తును అందిస్తే వాటిని పరిశీలించేందుకు అధికారులకు కూడా వీలుగా ఉంటుందన్నారు.

### అవగాహన కల్పించాలి

గ్రామ సభలో సరైన రీతిలో అవగాహన కల్పించకపోవడంతో లబ్ధిదారుల్లో చాలా వరకు సందేహాలు ఎదురవుతున్నట్లు తెలిపారు. అధికారులు తప్పకుండా దరఖాస్తుదారుడి పూర్తి వివరాలను అడిగి తెలుసుకొని, పథకాలకు సంబంధించి దరఖాస్తులో చాలా వరకు స్క్రూటినీ అయిపోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, డిప్యూటీ కలెక్టర్, కాడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శేఖర్, ఆర్డీవో కృష్ణన్, మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

### సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

బొంరాస్‌పేట : ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. మంగళవారం బొంరాస్‌పేట మండలంలోని లింగన్‌పల్లిలో ప్రజా పాలన గ్రామసభలో కలెక్టర్ పాల్గొన్నారు. ఆరు గ్యారెంటీలకు ప్రజలిచ్చిన దరఖాస్తులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రకటించిన సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా అధికారులు చొరవ చూపాలని ఆదేశించారు. సంక్షేమ పథకాల పట్ల ప్రజలకు పూర్తిగా అవగాహన కల్పించాలన్నారు. మహాలక్ష్మి పథకం కింద దరఖాస్తు చేసుకునేవారు 18 సంవత్సరాల నుంచి 57 సంవత్సరాలలోపు వయసు కలిగి ఉండాలని, అదేవిధంగా ఎలాంటి పెన్షన్లు పొందకుండా ఉన్నవారు మాత్రమే ఈ పథకానికి అర్హులని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. పథకాలకు దరఖాస్తు చేసుకునే వారికి రేషన్‌కార్డు తప్పనిసరిగా ఉండాల్సిన అవసరం లేదని కలెక్టర్ అన్నారు. రేషన్‌కార్డు అవసరం ఉన్నవారు తెల్ల కాగితంపై దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సొంత ఇల్లు లేనివారు గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. గ్రామ సభల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దరఖాస్తులు స్వీకరించాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామ సభలో డీఆర్‌డీవో కృష్ణన్, మండల ప్రత్యేకాధికారి రాంరెడ్డి, సర్పంచ్ కాశప్ప, ఎంపీడీవో వెంకన్‌గౌడ్, అధికారులున్నారు.

# డబ్బులిస్తేనే పింఛన్లు

- డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్న అధికారులు
- ప్రజాపాలనలో కాంగ్రెస్ ఎంపీటీసీ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి ఫిర్యాదు

తాండూరు రూరల్, జనవరి 2 : కొంత మంది అధికారులు డబ్బులిస్తేనే పింఛన్లు ఇస్తామంటూ పేదల నుంచి రూ.200 చొప్పున వసూలు చేశారని స్వయంగా కాంగ్రెస్ ఎంపీటీసీ రాజ్‌కుమార్ ప్రజాపాలనలో తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ముందు ప్రస్తావించారు. ఎమ్మెల్యే కల్పించుకొని వెంటనే ఈ విషయంపై విచారణ చేసి, సదరు అధికారిని సస్పెండ్ చేయాలని ప్రత్యేకాధికారి చక్రపాణిని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం తాండూరు మండలం, కరణ్‌కోట‌లో జరిగిన ప్రజాపాలనకు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళారులకు తావులేకుండా నేరుగా అధికారులకు బదులు, బలహీనవర్గాలవారు 5 గ్యారెంటీలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ఫారాలు కూడా ప్రభుత్వమే ఉచితంగా ఇస్తున్నదని, ఎవ్వరూ కొనుగోలు చేయవద్దని సూచించారు. గ్రామంలో 20కి పైగా కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేకుండా ప్రజల వద్దకు అధికారులు వచ్చి నేరుగా దరఖాస్తులు స్వీకరిస్తున్నారని తెలిపారు. పింఛన్ల డబ్బుల వసూళ్లకు పాల్పడినవారి వివరాలు సేకరించాలని స్థానిక పంచాయతీ కార్యదర్శి ఆనంద్‌రావును ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ రవీందర్‌గౌడ్, జడ్పీటీసీ సభ్యురాలు మంజుల, వైస్ ఎంపీపీ స్వరూప, సర్పంచ్ వీణ, ఎంపీటీసీలు రాజ్‌కుమార్, శివకుమార్, వసంత్‌కుమార్, ప్రత్యేకాధికారి చక్రపాణి, తహసీల్దార్ తారాసింగ్, ఆర్‌ఐ బాల్‌రాజ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నాగప్ప పాల్గొన్నారు.

### పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే

కరణ్‌కోట గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను ఎమ్మెల్యే సందర్శించారు. పాఠశాలలో ఎంఈవో వెంకటయ్యగౌడ్, హెచ్‌ఎం నర్సిరెడ్డితోపాటు ఉపాధ్యాయులు ఎమ్మెల్యేను సన్మానించారు. అనంతరం రూరల్ సీఐ రాంబాబు, ఎస్సై మధుసూదన్‌రెడ్డి కూడా ఎమ్మెల్యేను సన్మానించారు.